సాక్షి విజయనగరం

సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



విద్యా కానుక సిద్ధం

పిల్లలకు ఇచ్చే ఆస్తి విద్యేఅని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంటుంటారు.

- 8లో



'కథా పరిమళాలు' పుస్తకావిష్కరణ

గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఆదివారం సాయంత్రం 'కథా పరిమళాలు' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు.

- 8లో



ముగిసిన పగడాలమ్మ జాతర

భక్తులు కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ఖ్యాతి గడించిన మండలంలోని జావాం గ్రామదేవత పగడాలమ్మ జాతర అత్యంత వైభవంగా ముగిసింది.

- 8లో



న్యూస్‌రీల్

బాబా ఉరుసు మహోత్సవం రేపు



హజరత్ గంజేసయ్యద్ బాబా దర్గా

విజయనగరం: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం ఎదురుగా ఉన్న హజరత్ గంజేసయ్యద్ బాబా ఉరుసు మహోత్సవాన్ని ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నట్టు దర్గా అధ్యక్షుడు ఖాదర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉరుసు ఉత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఆ రోజు బాబాదర్గాలోని గుసుల్, ఫాతేహా, చందనం, సలామ్, మిలాద్ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. రంజాన్ ఇఫ్తార్ అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, కార్యక్రమంలో ముస్లిం సోదరులంతా పాల్గొనాలని కోరారు.

ఏటీఎంల్లో నగదు నిల్



దోలపేట వద్ద నగదు లేని ఏటీఎంలు

రాజాం : రాజాంలో 27కి పైగా ఏటీఎంలు ఉన్నాయి. ఇవన్నీ గడిచిన రెండు రోజులుగా నగదు లేక బోసిపోయాయి. వరుసగా బ్యాంకులకు మూడు రోజులు సెలవులు రావడంతో నగదు లావాదేవీలు స్తంభించాయి. ఈ క్రమంలో ఏటీఎంల్లో డబ్బులు నింపాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో నగదు లేక ఖాళీగా దర్శనమిచ్చాయి. ఉద్యోగులు, వ్యాపారులు నగదు కోసం ఏటీఎంలను ఆశ్రయించి లేక నిరాశగా వెనుదిరిగారు.

విత్తన గుళికలతో వ్యవసాయం



రైతులకు సూచనలిస్తున్న అధికారులు

విజయనగరం రూరల్: విత్తన గుళికలతో వ్యవసాయం మేలని ప్రకృతి వ్యవసాయం రీజినల్ శిక్షణ లీడ్ (ఆర్‌టీఎల్) ప్రకాష్ అన్నారు. మండలంలోని దుప్పాడ గ్రామంలో రైతులకు ఏపీసీఎన్ఎఫ్ (ప్రకృతి వ్యవసాయం) ఆధ్వర్యంలో రైతు ఆర్.అప్పారావు పొలంలో నువ్వుల పంటలో బహుళ పంటల ప్రణాళికపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విత్తనాల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌టీఎల్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో చీడ పీడలు తొలగి, భూమి సారవంతమై నాణ్యమైన పంట ఉత్పత్తులు వస్తాయన్నారు. సాగుకు ముందు నవ ధాన్యాల జల్లితే భూమికి పోషకాలు అందుతాయని తెలిపారు. రీజినల్ శిక్షణ అధికారి హేమ సుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఈఓల సంఘం అధ్యక్షుడిగా నాగరాజు



ఏఈఓల సంఘ నూతన కార్యవర్గ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈఓలు) సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎం.నాగరాజు ఎన్నికయ్యారు. స్థానిక కృషి భవన్‌లో ఆదివారం వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారులుగా ఎరుకునాయుడు, రమేష్ వ్యవహరించారు. కార్యదర్శిగా డి.కూర్మారావు, కోశాధికారిగా ఎం.సూరిబాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఏఈఓల పదోన్నతులు సాధించడానికి కృషి చేస్తానని తెలిపారు.

సిద్ధం



విభిన్న ప్రతిభావంతులను అన్ని విధాల ఆదుకునేందుకు ఓ వైపు ప్రభుత్వం, మరోవైపు స్వచ్ఛంద సంస్థలు తమ వంతు కృషి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వారికి సహాయ ఉపకరణాల పంపిణీకి జిల్లాలో రంగం సిద్ధమైంది. ఇందుకుగాను వారిని గుర్తించేందుకు సోమవారం నుంచి గుర్తింపు శిబిరాలు నిర్వహించనున్నారు.

- విభిన్న ప్రతిభావంతులకు సహాయ ఉపకరణాలు
- అర్హులైన లబ్ధిదారుల గుర్తింపునకు జిల్లాలో శిబిరాలు
- నేటి నుంచి నియోజకవర్గాల వారీ శిబిరాల నిర్వహణ
- రూ.4 కోట్ల విలువైన ఉపకరణాలు రెడీ
- శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : జేసీ

విజయనగరం అర్బన్:

విభిన్న ప్రతితిభావంతులకు సహాయ ఉపకరణాలను ఉచితంగా జిల్లాలో పంపిణీ చేయడానికి విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ రంగం సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ప్రముఖ కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం (అలిమ్ కో) హైదరాబాద్ సంస్థ ద్వారా ఉపకరణాల ఉచిత సరఫరాను జిల్లాలో చేపట్టనుంది. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎమ్పోవేర్మేంట్ సంస్థకు విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చేసిన అభ్యర్థన మేరకు సుమారు రూ.4 కోట్ల విలువైన ఉపకరణాలను ఉచిత పంపిణీకి అలిమ్ కో సంస్థ ముందుకు వచ్చింది. దేశంలో ఇటువంటి గుర్తింపు శిబిరాలు ఏర్పాటు చేసి, వాస్తవిక అవసరం గుర్తించి, తదనుగుణంగా పంపిణీ చేసేందుకు విజయనగరం జిల్లాలో తొలిసారి ప్రారంభించబోతున్నారు. రాష్ట్రంలో కేవలం విజయనగరం, పార్వతీపురం మన్యం, చిత్తూరు జిల్లాలో మాత్రమే నిర్వహిస్తున్నారు. తొలిత అర్హులైన లబ్ధిదారుల వాస్తవిక అవసరాలను గుర్తించే ప్రక్రియను జిల్లాలో చేపట్టనున్నారు. ఇందుకోసం ఈ నెల 10వ తేదీ నుంచి నియోజకవర్గాల వారీగా గుర్తింపు శిబిరాలను నిర్వహించనున్నారు.

నియోజకవర్గాల వారీగా శిబిరాలు

జిల్లాలోని నియోజకవర్గాల కేంద్రాల్లో ఈ గుర్తింపు శిబిరాలు నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం నిర్వహిస్తారు. తొలిత ఎస్.కోట నియోజకవర్గ పరిధి మండలాల కోసం ఈ నెల 10న ఎస్.కోట మండల కేంద్రంలో నిర్వహిస్తారు. ఈ నెల 12న బొబ్బిలి, 13న రాజాం, 15న చీపురుపల్లి, 17న గజపతినగరం, 19న నెల్లిమర్ల, 21న విజయనగరం నియోజకవర్గాల కేంద్రాల్లో శిబిరాలు నిర్వహిస్తారు.

గుర్తింపు ఉపకరణాల వివరాలు

మూడు చక్రాల సైకిళ్లు, వీల్ చైర్లు, చంక కర్రలు, కృత్రిమ కాళ్లు, కాలిఫర్స్, రోలేటర్స్, చెవి మిషనులు (బీటీఈ), వాకింగ్ స్టిక్స్, మానసిక ప్రతిభావంత పిల్లలకు ఎంఎస్ఐఈడీ కిట్స్, లెప్రసీ సోకిన వారికి ఏడీఎల్ కిట్, సీపీచైర్, బ్యాటరీ ఆపరేటెడ్ మూడు చక్రాల సైకిళ్లు ఉన్నాయి. 80 శాతం శారీరక వికలాంగత్వం ఉన్న వారికి మాత్రమే బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిల్ పొందడానికి అర్హులు. చేతులు బాగుండి, కాళ్లు వికలాంగత్వం కలిగి ఉన్న దివ్యాంగులకు మాత్రమే ఈ పరికరం లభిస్తుంది.

శిబిరాలకు తీసుకురావాల్సిన పత్రాలు, అర్హతలు

- మెడికల్ బోర్డు ద్వారా జారీ చేసిన సదరం వైద్య ధ్రువీకరణ పత్రం (40 శాతం అంతకన్నా ఎక్కువ)
- ఆదాయ ధ్రువీకరణ పత్రం (నెలకు రూ.15వేలకు మించకుండా)
- రేషన్ కార్డు లేదా ఓటరు కార్డు (చిరునామా కోసం), ఆధార్ కార్డు
- రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు (అంగవైకల్యం కనిపించే విధంగా ఉన్నవి)

సద్వినియోగం చేసుకోవాలి



విభిన్న ప్రతిభావంతులు ఈ శిబిరాలకు హాజరై సద్వినియోగం చేసుకోవాలి. గత మూడు సంవత్సరాలలో ఈ ఉపకరణాలు తీసుకున్న వారు అర్హులు కారు. ఈ శిబిరాలు కేవలం సహాయ ఉపకరణాల కోసం గుర్తింపు మాత్రమే. ఏ విధమైన వైద్య ధ్రువీకరణ ప్రతాలు, పింఛన్ల మంజూరు కోసం ఈ శిబిరాలు కాదు. కేవలం సహాయ వస్తు పరికరాలకు అర్హత గుర్తింపు కోసం మాత్రమే.

– కె.మయూర్ అశోక్, జేసీ

పంటల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ

పంటలకు సోకే వ్యాధులను నిర్ధారించేందుకు గ్రామ స్థాయిలోనే సంబంధిత పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ఆయా ఆర్‌బీకేల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. దీంతో రైతులకు కొంత ఉపశమనం కలగనుంది.



గంట్యాడ మండలంలోని రైతు భరోసా కేంద్రం

- ప్లాంట్ హెల్త్ డయోగ్నోస్టిక్ సెంటర్స్ ఏర్పాటుకు సన్నాహాలు
- మండలానికి ఒకటి చొప్పున జిల్లాలో 27 ఆర్‌బీకేల్లో ఏర్పాటు
- గ్రామ స్థాయిలోనే వ్యాధి నిర్ధారణ

విజయనగరం ఫోర్ట్:

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చిన విధంగానే పంటల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది. ప్రజలకు సోకే బీపీ, సుగర్ వంటి వ్యాధుల పరీక్షకు ఫ్యామిలీ డాక్టర్ విధానం తెచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పంటలు, మొక్కలకు వ్యాప్తి చెందే తెగుళ్లు, చీడపీడలపై కూడా వ్యాధి నిర్ధారణ చేయనుంది. పంటలకు ఆశించే వ్యాధుల పై వ్యాధి నిర్ధారణ చేసి రైతులకు అండగా ఉండనున్నారు. ఇందుకోసం జిల్లాలో ప్లాంట్ హెల్త్ డయోగ్నోస్టిక్ సెంటర్స్ (మొక్కల వ్యాధి నిర్ధారణ కేంద్రాలు) ఏర్పాటు చేయనున్నారు. వ్యాధి నిర్ధారణ చేసేందుకు అవసరమైన సిబ్బందిని కూడా ఇప్పటికే ఎంపిక చేశారు. వారికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మండలానికి ఓ కేంద్రం

ప్లాంట్ హెల్త్ డయోగ్నోస్టిక్ సెంటర్‌ను మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు. సొంత భవనం ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 27 మండలాల్లో ప్లాంట్ హెల్త్ డయోగ్నోస్టిక్ సెంటర్స్ ఏర్పాటు చేస్తారు. ఈ కేంద్రాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడానికి 27 మంది గ్రామ వ్యవసాయ సహాయకులను ఎంపిక చేశారు. వీరికి 3 వారాల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు, 30వ తేదీ నుంచి మే 5 వరకు, అదే విధంగా మే రెండో వారం నుంచి మూడో వారం శిక్షణ ఇస్తారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఆశించే తెగుళ్లు, చీడపీడలు, కలుపు యాజమాన్యం, నీటి యాజయాన్యం, పంట కోత తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి పరిశోధన శాస్త్రవేత్తలు, విస్తరణ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇస్తారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడానికి ప్రభుత్వం రూ.55 వేలు విలువ చేసే పరికరాలు సరఫరా చేయనుంది.



వ్యాధి నిర్ధారణ పరీక్ష చేస్తున్న సిబ్బంది

రైతులకు అండగా ప్రభుత్వం

విత్తనాలు, ఎరువులు గ్రామాల్లోనే ప్రభుత్వం అందిస్తుంది. అదే విధంగా రైతులు పండించిన ధాన్యాన్ని కూడా రైతు కళ్లాల వద్దకు వెళ్లి ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. పంటలకు ఆశించే తెగుళ్లు, చీడపీడలను కూడా గ్రామ స్థాయిలో వ్యాధి నిర్ధారణ చేసి నివారణ చర్యలు కూడా తెలియజేయనున్నారు. సాగు పెట్టుబడి కోసం వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుంది. ఇలా అన్నివిధాలా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుంది.

జిల్లాలో 27 కేంద్రాలు

ప్లాంట్ హెల్త్ డయోగ్నోస్టిక్ సెంటర్స్ జిల్లాలో 27 చోట్ల ఏర్పాటు చేయనున్నాం. ఈ మేరకు సిబ్బందిని ఎంపిక చేశాం. వారికి త్వరలోనే శిక్షణ ఇస్తాం.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

నకిలీ వైద్యుడి అరెస్ట్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రవికిరణ్(వెనుక ముసుగులో నిందితుడు)

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ, గుంటూరు జిల్లాల్లోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులను వైద్యుడిగా నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిని ఎన్టీఆర్ జిల్లా పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.4,500 నగదు ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం, రెల్లివలస గ్రామానికి చెందిన 24 ఏళ్ల ధర్మవరపు జయరాం ఇంటర్మీడియెట్ చదివాడు. కొన్నేళ్లు విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆస్పత్రుల్లో డాక్టర్ల వద్ద అసిస్టెంట్‌గా పని చేశాడు. జల్సాలకు అలవాటు పడిన జయరాం సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో డాక్టర్ అవతారం ఎత్తాడు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి తాను డాక్టర్‌నని రోగులు, వారి బంధువులను నమ్మించేవాడు. రోగుల గదులకు వెళ్లి తన వద్ద నగదు ఉందని, ఫోన్ పేలో బ్యాలెన్స్ లేదని నమ్మబలికేవాడు. ఫోన్ పేకు నగదు బదిలీ చేస్తే నగదు ఇస్తానని చెప్పేవాడు. నగదు బదిలీ జరిగిన తరువాత ఆపరేషన్ థియేటర్‌లో పర్సు మర్చిపోయానని చెప్పి అక్కడ నుంచి ఉడాయించేవాడు. ఇదే తరహాలో విజయవాడ, గుంటూరులోని పలు ఆస్పత్రుల్లో నగదు వసూలు చేశారు. విజయవాడలో జరిగిన మూడు ఘటనలపై సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. నిందితుడి కోసం పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి గాలించారు. ఈ నెల నాలుగో తేదీన విజయవాడలోని కృష్ణలంకలోని ఓ హోటల్ రూమ్‌లో దిగిన జయరాం వారధి వద్ద సంచరిస్తుండగా పోలీసులు ఆదివారం ఉదయం అరెస్టు చేశారని ఏసీపీ తెలిపారు. నిందితుడిపై రాష్ట్ర వ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని వివరించారు. విలేకరుల సమావేశంలో సీఐ బి.హెచ్.వెంకటేశ్వర్లు, ఎస్ఐలు ఫణీంద్ర, ప్రమీల, రంభ పాల్గొన్నారు.

మంచిని ఆశీర్వదించండి



ప్రజల మద్దతుతో జగనన్న స్టిక్కర్లు అతికిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- జగనన్నను మళ్లీ గెలిపించండి
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందరికీ మంచి జరిగిందని మళ్లీ వైఎస్సార్‌సీపీని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. కెల్లలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల అనుమతితో స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణ రాజు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిని చూసి

ఓర్వలేకే కుట్రలు

- ప్రజలంతా ఓ కంట కనిపెట్టాలి
- పేదలు బాగుపడితే చంద్రబాబు చూడలేకపోతున్నారు..
- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి: జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, పక్కన జెడ్పీ చైర్మన్, ఎంపీ

చీపురుపల్లిరూరల్(గరివిడి):

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి పాలనను చూసి ప్రతిపక్ష నేత చంద్రబాబు అండ్ కో, ఎల్లో మీడియా ఓర్వలేక కుట్రలు పనుతున్నారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రజలకు మంచి జరిగితే చూడలేకపోతున్నారని విమర్శించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం విస్మరించినా మరిన్ని కుట్రలు పన్నుతారని దుయ్యబట్టారు. గరివిడి మండలంలోని తోండ్రంగి గ్రామంలో సుమారు రూ.కోటితో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, 104 వాహనాలను, సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్, దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహాలను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందులో రాజీపడే అవసరం లేదన్నారు. పేదల కోసం సంక్షేమ పాలన సాగిస్తుందన్నారు. స్థానికంగానే ప్రజల సమస్యలు పరిష్కారం కావాలనే ఆలోచనతో సచివాలయ వ్యవస్థ నెలకొల్పడం జరిగిందన్నారు. ఆర్‌బీకేల ద్వారా వ్యవసాయదారునికి సకాలంలో విత్తనాలు, ఎరువులు అందిస్తూ పండిన పంటకు గిట్టుబాటు ధర వచ్చేలా ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. నాలుగేళ్ల పాలనలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో ఈ గ్రామానికి రూ.8.83 కోట్ల నగదును ప్రజలకు అందించామన్నారు. గ్రామంలో ఉన్న పురాతన ఉన్నత పాఠశాలకు నాడు - నేడులో రూ.1.14 కోట్ల నిధులతో ఉన్నతంగా తీర్చిదిద్దామన్నారు. గ్రామంలో రూ.72 లక్షలతో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటిని అందించే కార్యక్రమం జరుగుతుందన్నారు. పాఠశాలల్లో డిజిటల్ విద్యా విధానాన్ని తీసుకువచ్చామన్నారు. దేశంలోనే ఆదర్శ పాలనగా జగన్‌మోహన్‌రెడ్డి ఖ్యాతి గడించారన్నారు. దీన్ని ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా సహించలేకపోతున్నాయని దుయ్యబట్టారు. పేదల కోసం మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి రెండు అడుగులు వేస్తే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పదడుగులు ముందుకు వేసి మంచి పాలన అందిస్తున్నారన్నారు. ఇక గ్రామాల్లోకి ఎన్నికల వేళ దొంగలు, దోపిడీదారులు వస్తారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజల దీవెనలు జగన్‌మోహన్‌రెడ్డిపై ఉంచాలన్నారు.



వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి బొత్స

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామానికి సంబంధించి రాజకీయాలతో సంబంధం లేకుండా రూ.8.83 కోట్ల నిధులను ప్రజలకు సంక్షేమ కార్యక్రమాల రూపంలో అందించామన్నారు. తోండ్రంగి గ్రామానికి సంబంధించి డీఎఫ్ఎస్ నుంచి రూ.2కోట్లతో రోడ్లు నిర్మించేలా నిధులు మంజూరు చేశామని చెప్పారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. దీన్ని ప్రజలంతా గుర్తించాలన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న ప్రచారాన్ని చైతన్యవంతులైన ప్రజలే తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అప్పుడే వారికి తగిన శాస్తి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ ఫలాలు అందని అర్హులెవరైనా ఉన్నారా.. అంటూ ఈ ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని ఆయన కోరారు.

ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమ కార్యక్రమాలు నేరుగా లబ్ధిదారులకే సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అందుతున్నాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల్లో అమల్లో ఎక్కడ కూడా అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో అంతులేని అవినీతి జరిగిందని విమర్శించారు. అర్హులుంటే చాలు.. పార్టీలకతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీ బెల్లాన అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ అశోక్‌కుమార్, డీఎంహెచ్ఓ ఎస్‌వి.రమణకుమారి, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్‌చక్రవర్తి, స్థానిక సర్పంచ్ పిల్ల బంగారమ్మ, ఎంపీటీసీ జమ్ము అమ్మన్నమ్మ, స్థానిక నాయకులు పిల్ల అప్పలనాయుడు, జమ్ము సతీష్, ఎంపీపీ మీసాల విజయలక్ష్మీ, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, వైస్ ఎంపీపీలు, అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, చిత్రంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన

క్లుప్తంగా

టాటా ఏస్, బైక్ ఢీకొని వ్యక్తికి స్వల్ప గాయాలు



వేపాడ: వీలుపర్తి రహదారిలో ఢీకొన్న టాటా ఏస్, బైక్

వేపాడ: మండలంలోని వీలుపర్తి రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపాల మిత్ర గాయాల పాలయ్యాడు. వేపాడ నుంచి వీలుపర్తి వైపు వెళ్తున్న టాటా ఏస్ ఎదురుగా వస్తున్న గోపాలమిత్ర కృష్ణ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బైక్‌పై వస్తున్న కృష్ణకు గాయాలయ్యాయి. ఈ మేరకు సమాచారం అందడంతో 108 పైలట్ ఎ.ప్రకాష్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని వేపాడ పీహెచ్‌సీకి తరలించి ప్రథమచికిత్స అందజేశారు.

చిన్నారి మృతిపై దర్యాప్తు

గజపతినగరం: అల్లూరి సీతారామ రాజు జిల్లా గురుగుబిల్లి మండలం అనంతగిరి గ్రామానికి చెందిన రెండు నెలల చిన్నారి మృతి చెందిన విషయంపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గజపతినగరం ఎస్సై గంగరాజు ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెండు నెలల చిన్నారి ఆర్.వర్ష ఆరోగ్యం క్షీణించడంతో వైద్యసేవల కోసం శనివారం సాయంత్రం ఆమె తల్లిదండ్రులు గజపతినగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్య సేవల అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి డాక్టర్ రిఫర్ చేశారు. దీంతో చిన్నారిని గజపతినగరం ప్రభుత్వ ఆస్పత్రికి తల్లిదండ్రులు తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రైవేట్ ఆస్పత్రి సిబ్బంది సకాలంలో స్పందించకపోవడంతో తమ బిడ్డ మృతి చెందిందని బాధిత తల్లి కృష్ణవేణి ఆరోపించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి ఆదివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

135కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి పట్టుబడిన కారు వద్ద పోలీసులు

శృంగవరపుకోట: మండలంలోని దొర్లపాలెం జంక్షన్ వద్ద ఓ కారులో ఉన్న 135 కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.కోట ఎస్సై తారకేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ స్విఫ్ట్ డిజైర్ కారును గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు పక్కన వదిలేసి పారిపోవడంతో అనుమానం వచ్చి కారు తెరిచి చూడగా 135కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. ఈ ఘటనపై ఏఎస్సై వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై చెప్పారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన బంగారయ్య

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామం సమీపంలో ఫ్లేవుడ్ ఫ్యాక్టరీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పోతనాపల్లి గ్రామానికి చెందిన పూడి బంగారయ్య మామిడిపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం పోతనాపల్లిలో గ్రామదేవత బండెమ్మతల్లి జాతరకు వచ్చి పసుపు కుంకుమలు సమర్పించి మనుమరాలి ఇంటికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి మామిడిపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎస్.కోట వైపు వస్తున్న క్వారీ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఘటనాస్థలిలోనే బంగారయ్య మృతి చెందాడు. ఎస్.కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170

జగనన్న విద్యా కానుక సిద్ధం

- 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కిట్లు
- రూ.1,650 విలువగల విద్యా సామగ్రి పంపిణీ
- జిల్లాలో లబ్ధిపొందుతున్న విద్యార్థులు 1,04,396 మంది
- వరుసగా నాలుగవ విడత విద్యార్థులకు లబ్ధి



తల్లితండ్రులపై భారం పడకుండా..

పిల్లలను బడికి పంపితే చాలు మిగిలిన అన్ని విషయాలను ప్రభుత్వమే చూసుకుంటుంది. విద్యార్థుల తల్లిదండ్రులపై ఎటువంటి ఆర్థిక భారం పడకుండా అవసరమైన చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు సర్కారు బడిలో చదివే పిల్లలకు విద్యాకానుక రూపంలో 9 రకాల వస్తువులతో కూడిన 'జగనన్న విద్యాకానుక' ప్రత్యేక కిట్లు అందజేస్తున్నారు. వాటిలో విద్యార్థి తరగతికి అనుగుణంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్, ఆక్స్‌ఫర్డ్, పిక్టోరియల్ డిక్షనరీ, మూడు జతల యూనిఫాం, బూట్లు, బెల్ట్, స్కూల్ బ్యాగ్ అందిస్తున్నారు. 2022-23 ఏడాదిలో లక్షా 3వేల 883 మంది విద్యార్థులకు రూ.17కోట్ల14లక్షలకు పైబడి ప్రభుత్వం నిధులు వెవెచ్చించింది. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో 1,579 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిద్వారా ఈ ఏడాది బోధన సాగిస్తున్న ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు లక్షా 4వేల 396 మంది విద్యార్థులు ఉన్నారని అధికారులు పేర్కొంటున్నారు. వారి కోసం రూ.17కోట 22లక్షల 53వేల పైచిలుకు నిధులు ఖర్చుచేసి 4వ విడత జగనన్న విద్యా కానుకలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

పాలకొండ రూరల్: పిల్లలకు ఇచ్చే ఆస్తి విద్యేఅని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంటుంటారు. ఆ మాటను నిజం చేయాలనే అహర్నిశలు కృషిచేస్తున్నారు. పిల్లలకు విద్యాభ్యాసంలో అవరోధాలు కలగకుండా విద్యారంగం అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారు. అన్నివర్గాల పిల్లలు చదువుల కోసం ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు పడకుండా అనేక సంక్షేమ పథకాల ద్వారా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధులు ఏటా కేటాయిస్తూ కార్పొరేట్ విద్యకు దీటుగా సర్కారు బడులను ఉన్నతంగా తీర్చిదిద్దుతోంది. నాడు-నేడు పేరిట ప్రభుత్వ బడులను బలోపేతం చేయడంతో పాటు జగనన్న విద్యా కానుక పేరిట ఏటా ప్రత్యేక కిట్లు విద్యార్థులకు అందిస్తున్నారు.

బడి బాట పట్టిన పిల్లలకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాంతో పాటు రూ.1,650 విలువైన విద్యా సామగ్రిని ఉచితంగా అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వరుసగా మూడేళ్ల పాటు ఈ కిట్లు అందించిన ప్రభుత్వం ఈ ఏడాది నాలుగో దఫా 'విద్యాకానుక' అందించేందుకు చర్యలు చేపట్టింది.

యూనిఫాంలో మార్పు

ఈ ఏడాది ప్రభుత్వం అందించే యూనిఫాం రంగుల్లో కొంతమేర మార్పులు చేయనున్నారని అధికారులు చెబుతున్నారు. గతంలో బాలురకు లైట్ స్కై కలర్ షర్ట్, థిక్ బ్లూ ఫ్యాంట్, బాలికలకు పింక్, బ్లూ కలయికతో కూడిన యూనిఫాం అందించారు. ఈ ఏడాది ప్లెయిన్‌గా ఉండే ఏకరూపదుస్తులను బాలురకు, బాలికలకు మాత్రం చెక్స్ కలిగిన యూనిఫాం ఇచ్చే అవకాశం ఉంది. అలాగే స్కూల్ బ్యాగ్ రంగులో కూడా స్వల్పంగా మార్పులు ఉండనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

రాష్ట్ర ఒలింపిక్ సంఘంలో వేణుగోపాలరావుకు చోటు



వేణుగోపాలరావును అభినందిస్తున్న గురాన అయ్యలు తదితరులు

విజయనగరం: రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గంలో విజయనగరానికి చెందిన సీహెచ్ వేణుగోపాలరావుకు చోటు దక్కింది. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సీహెచ్ వేణుగోపాలరావును చిత్తూరు జిల్లాలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన ఒలింపిక్ అసోసియేషన్ కార్యవర్గంతో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నికైన వేణుగోపాలరావుకు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు అభినందనలు తెలిపారు. నూతన కార్యవర్గం రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

16తో చెరకు క్రషింగ్ పూర్తి



మీడియాతో మాట్లాడుతున్న కర్మాగారం అధికారులు

రేగిడి:

మండలంలోని సంకిలి వద్ద గల ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో ఈ నెల 16వ తేదీతో చెరకు క్రషింగ్ నిలుపుదల చేస్తున్నామని కర్మాగారం సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఎ.నాగేశ్వరరెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మిగిలి ఉన్న చెరకును రైతులు అనుమతి తీసుకుని గడువులోగా తరలించాలని సూచించారు. చెరకు పర్మిట్‌లు కావాలనుకునే రైతులు తమ సిబ్బందిని సంప్రదించాలన్నారు. సకాలంలో చెరకు గానుగను విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన రైతులు, లారీ, ట్రాక్టర్, మినీట్రాక్టర్, మినీ లారీల డ్రైవర్లతో పాటు ఎడ్ల బండ్ల రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంతవరకూ 4.54 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తి కాగా, మరో 23 వేల టన్నుల చెరకు గానుగ ఆడేందుకు లక్ష్యంగా చేసుకున్నామని వివరించారు. ఇప్పటివరకూ కర్మాగారానికి చెరకు పంపిన రైతులకు పూర్తి స్థాయిలో చెల్లింపులు జరిగాయని వెల్లడించారు. కార్యక్రమంలో కేన్ డీజీఎం రమేష్‌రెడ్డి, కేన్ ఏజీఎం కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'కథా పరిమళాలు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: సహజ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సభా కార్యక్రమంలో ఎన్‌కే .బాబు సంపాదకత్వంలో రచించిన 'కథా పరిమళాలు' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, గేయ రచయిత గంటేడ గౌరునాయుడు సభాధ్యక్షత వహించారు. పాదిలాపు శ్రీనివాస్, చింతాడ తిరుమలరావులు సమీక్ష చేశారు. పుస్తకాన్ని నవలా రచయిత, కథకులు అట్టాడ అప్పలనాయుడు ఆవిష్కరించారు. అదేవిధంగా కథా ముత్యాలు అనే పుస్తకాన్ని ప్రముఖ రచయిత నాలుగెస్సులరాజు ఆవిష్కరించారు. పాయల మురళీకృష్ణ పుస్తక సమీక్ష చేశారు. పుస్తక అనువాదం కేవీ శేషారావు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం

- 1270 పనులకు రూ.37.63 కోట్లు
- జీఎస్‌డబ్ల్యూఎస్ ప్రత్యేకాధికారి రామచంద్రరావు



జీఎస్‌డబ్ల్యూఎస్ ప్రత్యేకాధికారి రామచంద్రరావు

పార్వతీపురంటౌన్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు గుర్తించిన పనులకు సంబంధించి తక్షణమే అప్‌లోడ్ చేస్తున్నామని జీఎస్‌డబ్ల్యూఎస్ ప్రత్యేకాధికారి రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజూ పనుల నివేదికను ప్రభుత్వానికి పంపుతున్నామన్నారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి ఆమోదం పొందిన పనులను సంబంధిత శాఖాధికారులకు అందజేసి తక్షణమే ప్రారంభించేలా చర్యలు చేపట్టామన్నారు. 1385 పనులు ప్రతిపాదించగా అందులో 1270 పనులు మంజూరని తెలిపారు. ఇప్పటివరకు ప్రారంభించిన 1227 పనులకు రూ.37.63 కోట్లను మంజూరు చేశారన్నారు. మరో 43 అభివృద్ధి పనులు కొద్ది రోజుల్లో ప్రారంభించేందుకు పూర్తి చర్యలు చేపట్టామని వివరించారు.

పనులు, నిధుల మంజూరు ఇలా..

విభాగం	మొత్తం పనులు	మంజూరైన నిధులు రూ. కోట్లలో
సీసీ రోడ్లు	618	15.16
కాలువలు	358	8.48
తాగునీటి పనులు	175	4.87
కల్వర్టులు	52	1.09
విద్యుత్ పనులు	19	0.35
ఇతర పనులు	38	1.68

గిరిజనుల తరఫున పోరాటం

- న్యాయవాది రేగు మహేశ్వరరావు



మాట్లాడుతున్న రేగు మహేశ్వరరావు

సాలూరు: బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని, గిరిజనుల తరఫున పోరాటం చేస్తామని గిరిజన ఉద్యోగుల న్యాయసలహాదారు, న్యాయవాది రేగు మహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన పట్టణంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాజకీయ లబ్ధికోసం టీడీపీ ప్రభుత్వం బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో నాడు తీర్మానించిందని గుర్తుచేశారు. రాజకీయపార్టీలు రాజకీయాల కోసం గిరిజనులకు అన్యాయం చేయడానికి చూస్తున్నాయని ఆరోపించారు.గతంలో చంద్రబాబు చేసిన తీర్మానం తప్పని టీడీపీలోని గిరిజన నాయకులు ఖండించాలని డిమాండ్ చేశారు. రాయలసీమలో బోయ వాల్మీకులను చంద్రబాబు, లోకేష్‌లు రెచ్చగొడుతున్నారని, మరోవైపు ఇక్కడ ఏడు నియోజకవర్గాల్లో గిరిజనులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. గిరిజనులకు అన్యాయం జరగనివ్వమని స్పష్టం చేశారు. గిరిజనులకు అండగా నిలబడాలని రాష్ట్రపతి, కేంద్రానికి లేఖ రాస్తామని చెప్పారు. అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించి చట్టప్రకారం గిరిజనుల హక్కులను కాపాడడానికి కృషిచేస్తామని స్పష్టం చేశారు. పలువురు గిరిజనేతరులు తప్పుడు కులధ్రువీకరణ పత్రాలు పొంది గిరిజనులుగా ఉద్యోగాలు, ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతున్నారని ఆరోపించారు.వారిపైనా న్యాయపోరాటం చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే ప్రజా క్షేత్రంలోకి వెళ్లి మా వద్ద ఉన్న ఆధారాలను ప్రజలకు చూపిస్తామన్నారు.దీనిపై త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

గ్రామదేవత సంబరాలు ప్రారంభం



మామిడిపల్లిలో నైవేద్యం తీసుకువెళ్తున్న భక్తులు

సాలూరు:

మండలంలో మామిడిపల్లి గ్రామదేవత పండుగ సంబరాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు వచ్చే నెల పండుగ జరగనున్న నేపథ్యంలో ఆదివారం గల్లకలిపారు. ముంగారమ్మ, దేశమ్మ, వల్లమ్మ, కొత్తమ్మ, గజేంద్రుడులకు గ్రామస్తులంతా భక్తి శ్రద్ధలతో పూజలు చేసి ఊరు కట్టారు. నైవేద్యాన్ని అమ్మవార్లకు భక్తులు సమర్పించారు. స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.

కొట్లాటలో గాయపడిన వ్యక్తి మృతి

- న్యాయం కోసం గ్రామస్తుల బైఠాయింపు
- పోలీస్‌స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత



శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో మరణించిన చంద్రరావు



పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించిన గ్రామస్తులు, బాధిత కుటుంబీకులు

పాలకొండ రూరల్: ఇద్దరి యువకుల మధ్య తలెత్తిన వివాదం కొట్లాటకు దారితీయగా ఈ ఘటనలో గాయపడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనపై బాధితులు, ఆ ప్రాంత వాసులు, పోలీసులు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. పాలకొండ నగరపంచాయతీ పరిధి 3వ వార్డు ఎన్‌కె.రాజపురం ప్రాంతానికి చెందిన యువకులు ముడిదాన మోహనరావు, చందక శివశంకర్ శుక్రవారం రాత్రి తమ నివాసాలకు సమీపంలో గల చెరువు వద్ద చేరుకున్నారు. అక్కడ వారి మధ్య వాగ్వాదం జరిగింది. కొంత సమయం తరువాత మోహన్‌రావు ఇంటికి శివశంకర్ చేరుకుని గొడవపడ్డాడు. ఈ క్రమంలో మరోసారి వాగ్వాదం జరిగి కొట్లాటకు దారితీసింది. ఆ సమయంలో అడ్డుపడిన మోహన్‌రావు తండ్రి చంద్రరావు(52) శివశంకర్ చేసిన దాడిలో తీవ్రగాయాలపాలయ్యాడు. ఆయనను తొలుత పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. శనివారం ఆయన పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. ఈఘటనపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కేసును పక్కదోవ పట్టిస్తున్నారన్న ప్రచారం ఊపందుకోవడంతో బాధిత కుటుంబీకులు, 3వ వార్డు ప్రజలు ఒక్కటై న్యాయం చేయాలంటూ రోడ్డెక్కారు. చంద్రరావు మరణానికి కారణమైనవారిపై కేసు నమోదు చేయాలని, బాధ్యులను అదుపులోకి తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని నినదిస్తూ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని బైఠాయించారు.

పాలకొండ- శ్రీకాకుళం రోడ్డులో నిలిచిన ట్రాఫిక్

పోలీస్ స్టేషన్ ఎదుట ఎన్‌కే రాజపురం గ్రామస్తులు బైఠాయించడంతో పాలకొండ- శ్రీకాకుళం రహదారిలో ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోయింది. దీంతో విషయం తెలుసుకున్న డీఎస్పీ జీవీ.కృష్ణారావు స్టేషన్‌కు వచ్చి బాధిత కుటుంబీకులు, గ్రామస్తుల నుంచి వివరాలు తెలుసుకుని చట్టపరమైన చర్యల తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధ్యుడిని అదుపులోకి తీసుకోవాలని, కేసు నమోదు చేయాలని ఎస్సై బి.శివప్రసాద్‌కు, తక్షణమే దర్యాప్తు జరపాలని సీఐ మురళీధర్‌కు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. దీంతో బాధితులు, గ్రామస్తులు శాంతించి వెనుదిరిగారు.

ముగిసిన పగడాలమ్మ జాతర



ఆలయం వద్ద క్యూలో భక్తులు



ఆలయ ఆవరణలో విద్యుత్‌దీపాలంకరణ

సంతకవిటి: భక్తులు కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ఖ్యాతి గడించిన మండలంలోని జావాం గ్రామదేవత పగడాలమ్మ జాతర అత్యంత వైభవంగా ముగిసింది. ఈనెల 7 నుంచి 9 వరకు మూడురోజుల పాటు ఆలయ కమిటీ జాతరను నిర్వహించింది. 24వ ఆలయ వార్షిక జాతరను ఈ ఏడాది పెద్ద ఎత్తున వినోద సాంస్కృతిక కార్యక్రమాల మధ్య నిర్వహించారు. ఆదివారం చివరి రోజు కావడంతో జావాం పరిసర గ్రామాల భక్తులతో పాటు శ్రీకాకుళం, విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు జాతరకు వచ్చారు. పగడాలమ్మకు ముర్రాటలతో మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో కిలోమీటరు మేర క్యూ భక్తులతో నిండిపోయింది. కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వాటర్ ప్యాకెట్లు వంటివి పంపిణీచేసి దాహార్తిని తీర్చారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం బాణసంచా కార్యక్రమాలు మధ్య జాతర ముగిసింది. రాత్రి 9 గంటలకు సత్యహరిశ్చంద్ర నాటకాన్ని రాష్ట్ర కళాకారులతో ఏర్పాటు చేశారు. పంచాయతీ సర్పంచ్ బొనెల ప్రసాద్, మాజీ సర్పంచ్ రామకృష్ణంనాయుడుతో పాటు గ్రామానికి చెందిన ఆలయ కమిటీ సభ్యులు భారీ ఎత్తున మౌలికవసతులు యాత్రికులకు కల్పించారు. రాజాం రూరల్ సీఐ సీహెచ్.ఉపేంద్ర, సంతకవిటి, రేగిడి ఎస్సైలు ఆర్.జనార్దనరావు, శ్రీనివాసరావు తదితరులు జాతరను పోలీస్ బందోబస్తుతో పర్యవేక్షించి, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.